క్లుప్తంగా

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

దొనకొండ: కాకాని శంకర కంటి ఆస్పత్రి సహకారంతో దొనకొండలో ఆదివారం నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. మండలంలోని పలు గ్రామాల నుంచి సుమారు 200 మంది రోగులు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వీరిలో 60 మందికి ఆపరేషన్లు అవసరమని వైద్యులు జాగృతి, స్పందన తెలిపారు. 10 మందిని వెంటనే కంటి ఆపరేషన్లకు తీసుకెళ్లారు. మరో 50 మందికి వచ్చే వారం ఆపరేషన్లు చేస్తామని వైద్యులు తెలిపారు. అవసరమైన వారికి కంటి మందు అందజేశారు.

వీరనారాయణస్వామి 88వ ఆరాధన

పెద్దారవీడు: మండలంలో పుచ్చకాయలపల్లి గ్రామంలో వెలసిన వీరనారాయణస్వామి 88వ ఆరాధన మహోత్సవం సోమవారం నిర్వహించనున్నట్లు గ్రామస్తులు ఆదివారం తెలిపారు. ఉదయం స్వామి వారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని అర్చకులు సత్యనారాయణస్వామి తెలిపారు. మధ్యాహ్నం భక్తుల కోసం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు చెప్పారు. రాత్రి భక్తి పాటలతో భజన కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు.

7 నుంచి డిగ్రీ స్పాట్ అడ్మిషన్లు

దొనకొండ: స్థానిక గౌతమీ డిగ్రీ కళాశాలలో డిగ్రీ కోర్సుల్లో 2024–25 విద్యా సంవత్సరానికి స్పాట్ అడ్మిషన్లకు ఈ నెల 7 నుంచి 12వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని కళాశాల అడ్మిన్ నాని ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రిజిస్ట్రేషన్ల కోసం ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకురావాలన్నారు.

దారి ఇలా.. ప్రయాణం ఎలా..?



సగం రోడ్డును కప్పేసిన ముళ్ల చెట్లు



తారు రోడ్డు పై మార్జిన్ మట్టి ని చదరం చేస్తున్న దోజర్

- అధ్వానంగా వేంపాడు–మారెళ్ల రోడ్డు
- రోడ్డుకు ఇరువైపులా పెద్ద ఎత్తున చిల్లచెట్లు
- తూతూమంత్రంగా రోడ్డు మెయింటెన్స్ పనులు

ముండ్లమూరు(దర్శి): మండలంలోని వేంపాడు నుంచి మారెళ్ల వెళ్లే రోడ్డు అధ్వానంగా తయారైంది. రోడ్డుకు ఇరువైపులా చిల్లచెట్లు భారీగా పెరిగిపోవడంతో ఈ రోడ్డు ప్రయాణం నరకప్రాయంగా మారిందని వాహనదారులు వాపోతున్నారు. చిల్ల చెట్లతో రాత్రిళ్లు పెద్ద పెద్ద వాహనాలు ఎదురుగా వస్తే ద్విచక్రవాహనదారులు, ఇతర వాహనదారుల ఇక్కట్లు చెప్పేవీ కావు.

తూతూమంత్రంగా పనులు..

కాగా ఇటీవల రోడ్డు మెయింటన్స్ పనులు చేస్తున్న కాంట్రాక్టర్‌తూతూమంత్రంగా నిర్వహించి చేతులు దులుపుకుంటున్నారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న చిల్లచెట్లను తొలగించాల్సి ఉంది. కానీ కాంట్రాక్టర్ చిల్లచెట్లను తొలగించకుండానే పనులు చేస్తున్నారు. రోడ్డు మార్జిన్‌లో పోయాల్సిన మట్టిని తారు రోడ్డుపై పోస్తున్నారు. ఆ మట్టిని దోజర్‌తో చదును చేస్తున్నారు. మార్జిన్‌లో మట్టి తోలాల్సిన కాంట్రాక్టర్ ఇష్టం వచ్చినట్లు రోడ్డుపైకి మట్టి తోలడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు కూడా పట్టించుకోకపోవడంతో కాంట్రాక్టర్ ఇష్టం వచ్చినట్లు పనులు చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. రోడ్డుకు ఇరువైపులా పెద్ద ఎత్తున మొలిచిన చిల్ల చెట్లను తొలగించకుండా పనులు చేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎదురుగా వాహనాలు వచ్చినప్పుడు కార్లు వంటి వాటికి చెట్ల గీసుకొని గీతలు పడుతున్నాయని వాపోతున్నారు. రోడ్డుపైనే మట్టిపోయడంతో దుమ్ము లేని వెనుక వైపు వస్తున్న వారికి ఇక్కట్లు తప్పడం లేదు. అధికారులు స్పందించి పనులు సక్రమంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ఇరువైపులా చెట్లు పెరిగి కుచించుకు పోయిన రోడ్డు

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం

దర్శి: నిరుపేద కూలీ మృతి చెందడంతో విషయం తెలుసుకున్న మానవత స్వచ్ఛంద సంస్థ ఆర్థిక సాయం అందజేసింది. వివరాల్లోకి వెళితే..పట్టణంలోని ఎస్సీ కాలనీలో పెయింటర్‌గా పనికి కూలికి వెళ్లే గర్నెపూడి శివప్రసాద్ ఇటీవల ప్రమాదవశాత్తు కింద పడి మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న మానవత సంస్థ ప్రతినిధులు శివప్రసాద్ కుటుంబానికి ఆత్మీయ సహకారం అందించారు. సంస్థ చైర్మన్ దేవత వరప్రసాద్ చేతుల మీదుగా రూ.5000, స్వాతి కలర్స్ యజమాని ఎదురు నారాయణరెడ్డి చేతుల మీదుగా రూ.5000 ఆర్థిక సాయంగా అందజేశారు. పేద కుటుంబాన్ని ఆదుకున్నందుకు స్థానికులు వారిని అభినందించారు. మానవత సభ్యులు వారి కుటుంబానికి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ వాకా జనార్దన్‌రెడ్డి, కన్వీనర్ కపురం శ్రీనివాసరెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షుడు ధనిరెడ్డి వెంకటరెడ్డి, ట్రెజరర్ జి.వేణు, డైరెక్టర్ పి.రాజశేఖరెడ్డి, సభ్యులు అంబటి వెంకటేశ్వరరెడ్డి, వాకా పూర్ణ చంద్రారెడ్డి, గర్నెపూడి ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మృతుని కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న మానవతా సభ్యులు

పాలస్తీనాపై యుద్ధాన్ని ఆపాలి

దొనకొండ: పాలస్తీనాపై ఇజ్రాయేల్ సాగిస్తున్న అమానుష యుద్ధాన్ని ఆపాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కంకణాల ఆంజనేయులు కోరారు. యుద్ధం ఆపాలి.. ప్రపంచ శాంతిని కాపాడాలని స్థానిక బస్టాండ్ సెంటర్‌లో సీపీఎం కార్యకర్తలు పాలస్తీనాకు సంఘీభావ కార్యక్రమం నిర్వహించారు. సీపీఎం మండల కార్యదర్శి చిరుపల్లి అంజయ్య అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ తమ దేశంపై హమాస్ సంస్థ ఉగ్రవాద చర్యలకు పాల్పడిందని, దానిని నిర్వీర్యం చేసే లక్ష్యంతో యుద్ధాన్ని ప్రారంభిస్తున్నానని చెప్పిన ఇజ్రాయేల్ గత ఏడాది కాలంగా వేలాదిమంది ప్రాణాలు తీస్తూ ప్రపంచ యుద్ధానికి ఉసి గొల్పిందన్నారు. ఇజ్రాయేల్‌కు మద్దతుగా భారత ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును ఆయన తప్పు పట్టారు. భారత ప్రభుత్వం తన సాంప్రదాయానికి వ్యతిరేకంగా నేడు పాలస్తీనాపై యుద్ధానికి ఉసిగొల్పటం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా భారత ప్రభుత్వం ప్రపంచ శాంతి చర్యలకు ప్రయత్నించాలని కోరారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు తాండవ రంగారావు, మండల నాయకులు చిరుపల్లి అంజయ్య, కర్నా హనుమయ్య, కుందుర్తి అనిల్, కె.కిరణ్, కె.కృప, కోటేశ్వరరావు, చంటి, కె.అంజయ్య తదితరులు పాల్గొన్నారు.



దొనకొండలో ర్యాలీ చేస్తున్న సీపీఎం నాయకులు



వైపాలెం: పార్వతీదేవి అలంకారంలో వాసవీ అమ్మవారు



రాజంపల్లిలో ప్రత్యేక అలంకరణలో ధాన్యలక్ష్మి అమ్మవారు



పెద్దదోర్నాలలో శ్రీగాయత్రీదేవి అలంకారంలో దర్శనమిచ్చిన అమ్మవారు

వైభవంగా దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు



త్రిపురాంతకం ప్రత్యేక అలంకారంలో శ్రీబాలాత్రిపురసుందరీదేవి



భవానీదేవిగా వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి



నిజరూపదర్శనంలో శ్రీ జ్ఞానప్రసూనాంబదేవి

పెద్దదోర్నాల: శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా మండలంలోని పలు దేవాలయాల్లో వెలసిన అమ్మవార్లకు భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో వాసవీ మాత శ్రీగాయత్రీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి అర్చకులు బి.రాంప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో మహాన్యాస పూర్వక ఏక రుద్రాభిషేకం, చండీపారాయణం నిర్వహించారు. మహిళా మండలి ఆధ్వర్యంలో అమ్మవారికి శ్రీలలితా సహస్రనామ పారాయణం చేశారు. స్థానిక పోలేరమ్మ ఆలయంలో దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. స్థానిక లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో అమ్మవారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు కొండవీటి సుదర్శనాచార్యులు అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అభిషేకాలు నిర్వహించారు. మండల పరిధిలోని మోట్ల మల్లికార్జునపురంలో అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

ధాన్యలక్ష్మి అలంకరణలో రాజ్యలక్ష్మి

పెద్దారవీడు: విజయదశమి శరన్నవరాత్రి వేడుకలను పురస్కరించుకొని మండలంలోని రాజంపల్లె గ్రామంలో వెలసిన గొంద్రాలికొండ తిరుమలనాథస్వామి ఆలయంలో రాజ్యలక్ష్మి అమ్మవారు ధాన్యలక్ష్మి అలంకరణలో భక్తులకు ఆదివారం దర్శనమిచ్చారు. అర్చకులు భవానిప్రసాద్ ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృతం, అభిషేకాలు, కుంకుమ పూజలు, కలశం పూజలు నిర్వహించారు. అమ్మవారికి పట్టువస్త్రాలు, ఆభరణాలు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పార్వతీ దేవి అలంకారంలో వాసవీ అమ్మవారు

యర్రగొండపాలెం: దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు ఆదివారం భక్తులకు పార్వతీ దేవి అలంకారంలో దర్శనం ఇచ్చారు. అమ్మవారిని ఆలయ ప్రధాన అర్చకుడు రెంటచింతల శ్రీరామచంద్రమూర్తి ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. దేవస్థానం అధ్యక్ష, కార్యదర్శులు సూరె వెంకట ప్రసాద్, గుర్రం కృష్ణమూర్తి, కోశాధికారి గ్రంధి రమణారావు ఆలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాలను పర్యవేక్షించారు.

త్రిపురాంతకం: త్రిపురాంతకంలోని బాలాత్రిపురసుందరీదేవి, పార్వతి సమేత త్రిపురాంతకేశ్వరస్వామి వారి ఆలయాల్లో దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. పెద్దసంఖ్యలో భక్తులు, ప్రముఖులు ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొంటున్నారు. వేద పండితులచే ప్రత్యేక పూజాకార్యక్రమాలు జరుగుతున్నాయి. త్రిపురాంతకంలో దసరా శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా శ్రీబాలాత్రిపురసుందరీదేవి మూలవిరాట్ ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పార్వతి సమేత త్రిపురాంతకేశ్వరస్వామి వారి ఆలయంలో నవరాత్రులు సందర్భంగా పార్వతి త్రిపురాంబ సమేత త్రిపురాంతకేశ్వరస్వామి వారి ఉత్సవమూర్తుల ఉత్సవం వైభవంగా నిర్వహించారు. పల్లకీ ఊరేగింపులో మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమాలను ఈఓ చెన్నకేశవరెడ్డి పర్యవేక్షిస్తున్నారు.

కురిచేడు: దేవి శరన్నవరాత్రుల్లో భాగంగా శ్రీ జ్ఞానప్రసూనాంబదేవి తన నిజరూప దర్శనంతో భక్తులకు దర్శనమిచ్చారు. వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి భవానీమాతగా దర్శనమిచ్చింది. పూజారులు కురిచేటి సుబ్బారావు, నారాయణం వెంకటేశ్వర్లు భక్తులతో పూజలు చేయించారు. మహిళలు కుంకుమార్చనలు, సహస్రనామార్చనలు చేశారు.

దొనకొండ: స్థానిక అడ్డరోడ్డులో వెలసిన ఆనంద ఆశ్రమంలోని శివాలయంలో శరన్నవరాత్రుల సందర్భంగా ఈశ్వరీదేవి శాకాంబరీదేవిగా దర్శనమిచ్చారు. అమ్మవారికి 18 రకాల కూరగాయలతో అలంకరణలు చేసి అష్టోత్తర శతనామావళి, సామూహిక కుంకుమ పూజలు చేసి దూప దీప నైవేద్యాలు సమర్పించి హారతులిచ్చారు. పూజారి మణిబాబుశర్మ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. పెదన్నపాలెం గ్రామానికి చెందిన శింగిరెడ్డి గాలిరెడ్డి, వీరమ్మ దంపతులు భక్తులకు అల్పాహారం అందజేశారు. సోమవారం అమ్మవారు అన్నపూర్ణేశ్వరిగా దర్శనం ఇస్తున్నట్లు భైరవానంద స్వామి తెలిపారు.



త్రిపురాంతకం పార్వతి త్రిపురాంబ సమేత త్రిపురాంతకేశ్వరస్వామి ఉత్సవమూర్తుల ఊరేగింపు

చెట్లను తొలగించిన అధికారులు

కంభం: విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లకు చిల్లచెట్లు, తీగలతో నిండి పోయి ప్రమాదకరంగా ఉన్న నేపథ్యంలో సాక్షి దినపత్రికలో 'అల్లుకున్న నిర్లక్ష్యం' అన్న శీర్షికతో ప్రచురితమైన కథనాని విద్యుత్ శాఖ అధికారులు ఆదివారం స్పందించారు. స్థానిక ఎస్‌బీఐ సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ స్తంభాలు, పాత ప్రభుత్వ వైద్యశాల వెనుక ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఉన్న చిల్లచెట్లను తొలగించారు. ఒరిగిపోయిన విద్యుత్ స్తంభాలను సరిచేస్తామని అధికారులు తెలిపారు.

ముమ్మరంగా సజ్జ నూర్పిళ్లు

కొనకనమిట్ల: మండలంలో ఖరీఫ్‌లో చేపట్టిన సజ్జపంట కోతలు కోసిన రైతులు ముమ్మరంగా సజ్జపంట నూర్పిడులు చేస్తున్నారు. మండలంలో సుమారు 500 ఎకరాల్లో సజ్జ పంట సాగు చేశారు. మండలంలోని నాగంపల్లి, మునగపాడు, వెలిగండ్ల, నాగరాజుకుంట, చింతగుంట, అంబాపురం, రేగడపల్లి, వాగుమడుగు, సిద్దవరం గ్రామాల్లో ఎక్కువగా సజ్జ సాగు చేశారు. అయితే ఈ ఏడాది అరకొరగా వర్షాలు పడటంతో పంట దిగుబడి పెద్దగా లేదని రైతులు తెలిపారు. సజ్జ పంట ఎకరాకు 8 నుంచి 10 బస్తాలు మేర దిగుబడి వస్తుందని చెబుతున్నారు. ప్రస్తుతం సజ్జలు క్వింటా ధర రూ. 2200 వరకు బయట మార్కెట్‌లో కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం మద్దతు ధర ఎక్కువగా కొనుగోలు చేస్తు రైతులకు కొంతమేర పెట్టుబడులు పోను లాభాలు వచ్చే అవకాశం ఉంటుందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సజ్జ కోతలు అయిన తరువాత పొలాలను దుక్కులు దున్ని రబీ పంటగా అలసంద లేదా శనగ పంటను సాగు చేపడతామన్నారు. రెండో పంటలో మంచి దిగుబడి వచ్చి ధరలు బాగుంటే పెట్టుబడులు పోను కొంత ఆదాయం వచ్చే అవకాశం ఉంటుంది.

అన్నపై తమ్ముడు దాడి

బేస్తవారిపేట: స్థానిక పోలేరమ్మ ఆలయం సమీపంలో అన్నపై తమ్ముడు దాడి చేసిన సంఘటన జరిగింది. అన్నదమ్ములు మధ్య స్థల వివాదం ఉంది. ఈ నేపథ్యంలో దూదేకుల పెద్ద బాదుల్లా పశువుల పాకలో పనిచేసుకుంటున్న సమయంలో తమ్ముడు చిన్న బాదుల్లా వచ్చి దాడిచేశాడు. మొద్దు కత్తితో వెనుకవైపు నుంచి తలపై కొట్టడంతో తల పగిలి తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రున్ని కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఎస్సై ఎస్‌వీ రవీంద్రారెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు

విద్యుదాఘాతానికి షాపు దగ్ధం



మంటలను అదుపుచేస్తున్న గ్రామస్తులు

కురిచేడు: మండలంలోని పొట్లపాడు గ్రామ బస్టాండ్ సెంటర్‌లో పాతటైర్లు నిల్వచేసిన దుకాణం విద్యుదాఘాతానికి దగ్ధమైంది. ప్రమాదంలో రూ.20 నుంచి రూ.30 వేల వరకు ఆస్తినష్టం వాటిల్లినట్లు యజమాని పలుకూరి వెంకట రామయ్య తెలిపారు. ప్రమాదానికి గురైన దుకాణం పక్కనే మిషనరీ అంతా ఉందని, మంటలు దానికి అంటుకొని ఉంటే భారీ మొత్తంలో నష్టం వాటిల్లేదని వాపోయారు. మంటలు వ్యాపించగానే గ్రామస్తులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొని ట్రాక్టర్ సాయంతో మంటలను అదుపు చేశారు. విషయం దర్శి అగ్నిమాపక శాఖాధికారులకు తెలియజేయడంతో వారు మంటలను పూర్తిగా ఆర్పివేశారు.



టైర్లషాపులో కాలిపోయిన టైర్లు

పండగలు ప్రశాంతంగా జరుపుకోండి

- రికార్డింగ్ డ్యాన్స్‌లు, అశ్లీల నృత్యాలు చేస్తే కఠిన చర్యలు
- సెలవుల్లో పిల్లలపై నిఘా పెట్టాలి

మార్కాపురం: దసరా, దీపావళి పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలని డీఎస్పీ నాగరాజు సూచించారు. ఆదివారం తన కార్యాలయంలో సీఐ సుబ్బారావుతో కలిసి మాట్లాడారు. పండగ సెలవులు కావడంతో పిల్లలంతా ఇళ్లకు వస్తుంటారని, చెరువులు, వాగులు, గుండ్లకమ్మలకు ఈతకు వెళ్లకుండా నిఘాపెట్టాలన్నారు. యువతకు టూవీలర్స్ ఇచ్చేటప్పుడు లైసెన్స్ ఉందో లేదో చూడాలని, లైసెన్సులు లేకపోతే వాహనాలను ఇవ్వకూడదని హెచ్చరించారు. సెలవుల సందర్భంగా ఇతర ప్రాంతాలకు వెళ్లేవారు పోలీసులకు సమాచారం ఇవ్వాలని, విలువైన వస్తువులను జాగ్రత్తగా భద్రపరుచుకోవాలని సూచించారు. పండగల వేళ రికార్డింగ్ డ్యాన్స్‌లు, అశ్లీల నృత్యాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పేకాట, మట్కా, కోడిపందేలు ఆడితే కూడా కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామన్నారు. మారుమూల గ్రామాల్లో కూడా తాము నిఘా వ్యవస్థ ఏర్పాటు చేసుకున్నామని, పోలీసులతో దోబూచులాడవద్దని హెచ్చరించారు. ఆన్‌లైన్ గ్యాంబ్లింగ్ వలన చాలామంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, వాటికి దూరంగా ఉండాలని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు సెల్‌ఫోన్ ఇచ్చేప్పుడు జాగ్రత్తలు చెప్పాలన్నారు. సెల్‌ఫోన్‌లో పొరబాటున ఎవరైనా సైబర్ క్రైమ్‌కు సంబంధించిన ఇబ్బందిపడ్డా.. ఫోన్‌లలో ఎవరైనా బ్లాక్‌మెయిల్‌కు పాల్పడినా.. వీడియోలు డౌన్‌లోడ్ చేసి బ్లాక్ మెయిల్‌కు గురవుతున్నా తమకు సమాచారం అందించాలని వారికి పోలీసు సాయం అందిస్తామని తెలిపారు. దీపావళి పండగ సందర్భంగా టపాసులు అమ్మే దుకాణదారులు కచ్చితంగా పోలీసుశాఖ నుంచి లైసెన్సు తీసుకోవాలని సీఐ సుబ్బారావు తెలిపారు. అనధికారికంగా తయారు చేసినా.. లైసెన్సులు లేకుండా అమ్మినా.. కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీపావళి టపాసుల అమ్మకాలకు సంబంధించి సింగిల్‌విండో విధానం ద్వారా లైసెన్సులు ఇస్తామని చెప్పారు. దీపావళి మందులు అమ్మే ప్రాంతాల్లో నిర్వాహకులు అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు.



మాట్లాడుతున్న డీఎస్పీ నాగరాజు, పక్కన సీఐ సుబ్బారావు

డాక్టరేట్ గ్రహీతకు సన్మానం

గిద్దలూరు రూరల్: అమ్మ ఫౌండేషన్ అధ్యక్షుడు బోనేని వెంకటేశ్వర్లుయాదవ్ గౌరవ డాక్టరేట్ పొందిన సందర్భంగా యాదవ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని జ్యోతిరావుపూలే పార్కు ఆవరణలో ఆదివారం సన్మానం చేశారు. మొర్రిపిచ్చయ్య యాదవ్ మాట్లాడుతూ అమ్మ ఫౌండేషన్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలను నిర్వహించి ప్రజల్లో మంచి గుర్తింపు సాధించిన బోనేని వెంకటేశ్వర్లుయాదవ్‌కు సామాజిక సేవా రంగంలో డాక్టరేట్ అందించడం చాలా గొప్ప విషయమన్నారు. బీసీ నాయకులు ఒ. వెంకటయ్య యాదవ్, యాదవ ఉద్యోగ సంఘం నాయకులు కటారు పోలయ్య యాదవ్, రమణయ్య, ఈశ్వరయ్య, బాలయ్య, కృష్ణ, హరికృష్ణ, శేఖర్, పుల్లయ్య, సూర్యనారాయణ, పాండు, గోపాల్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విశ్వకర్మ నైపుణ్య శిక్షణ కేంద్రం ప్రారంభం

గిద్దలూరు రూరల్: స్థానిక రాచర్ల రోడ్డులో కేంద్ర ప్రభుత్వ ప్రవేశపెట్టిన 18 రకాల చేతి వృత్తుల వారికి శిక్షణ కేంద్రాన్ని బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బీజేపీ పట్టణ అధ్యక్షుడు అప్పిశెట్టి ఉదయ్‌శంకర్ శిక్షణ కేంద్రంలో చేతి వృత్తుల వారితో వారి నైపుణ్య సామర్థ్యాలను అడిగి తెలుసుకున్నారు. వివిధ రకాల చేతి వృత్తుల కళానైపుణ్యం కలిగిన వారికి జీవనోపాధిగా ఈ శిక్షణ కేంద్రం ఉపయోగపడుతుందన్నారు. భవనాశి రామాంజనేయులు, ఖాదర్, మట్టిమల్ల పుల్లయ్య, షఫీ, బండారి జయప్రసాదు, వీరచక్రం, కె.కృష్ణ, సురేష్ పాల్గొన్నారు.